కథా కౌముది



# అపరంజి చంద్రలత

## 1. అపరంజి

ఏ కదులుతోన్న బస్సునో రైలునో ఎక్కినంత పనయింది,ఆ వేళ చెకిన్ చేసేసరికి.అదీ రెండుచేతుల్లో బండెడుసామాను మోసుకొంటూ,రొప్పుతూరోజుతూ పరిగెత్తినంత పని!

బహుశా బోర్డ్ అయిన ఆఖరు ప్యాసెంజరో తనే ఏమో.ఎయిర్ హోస్టెస్ ఎదురొచ్చి మరీ,గబగబ తన సీట్ వద్దకు తీసుకెళ్ళింది.

కాబిన్ బ్యాగేజి సర్దేసి,సీట్ వంక చూసుకొనేసరికి,సహప్రయాణీకురాలెవరో,ఏకాగ్రతతో కిటికీఅద్దంలోనుంచి బయటకు చూస్తున్నారు.తన రచ్చరావిడి ఆవిడదృష్టిని ఏమాత్రం మళ్ళించలేదు.

సీట్లో కుదురుకొని,సీట్ బెల్ట్ పెట్టుకొన్నాక గానీ,తను నిశ్చింతగా ఊపిరి పీల్చుకోలేదు.

విమానం అప్పుడో ఇప్పుడో బయలుదేరుతుంది.

ఎప్పుడెప్పుడా అని ఎంతగానో ఎదురుచూసిన ఈవెంట్.ఎప్పటిలాగానే బిజీరోజు.ఆఖరి నిమిషందాకా ఉరుకులు పరుగుల పని.అనుకొన్నంత రెస్పాన్స్ రాకపోయినప్పటికీ,ఒకటి రెండు బిజినెస్ ఎంక్వైరీలను,ఒక ప్రోత్సాహక బహుమతినీ వెంటబెట్టుకొని ఇంటికెళుతోంది.ఆ ప్రతిష్టాత్మక డిజైనర్ ఫ్యాషన్ షో నుంచి.

గబగబ తన సోషల్ నెట్ వర్క్ స్టేటస్ లు అప్ డేట్ చేసిందో లేదో,సెల్ స్విచ్ ఆఫ్ చేయమని క్యాబిన్ క్రూ వినతి.అప్పుడిక తేరుకొని,చుట్టూ చూసింది.తన కో–ప్యాసెంజర్ ఎన్ 95 మాస్క్ పైన హుడ్ కూడా పెట్టుకొని ఉంది.భలే మనిషి!ఆవిడింకా లాక్ డౌన్ ప్రభావం నుంచి తేరుకొన్నట్లు లేదు!

తను మాత్రం?గత వారంరోజుల ఫ్యాషన్ షో మైకం నుంచి తేరుకొందా?అప్రయత్నంగా ముఖాన ఉన్నమాస్క్ ను సవరించుకొంది.ఇంకా మెళ్ళో వేళ్ళాడుతోన్నఐ.డి.కార్డ్ ను అసంకల్పితంగా తాకింది.మునివేళ్ళతో అపురూపంగా తడిమింది.“అప్రా అపారెల్స్"తన స్వంతలేబుల్.

ఇదంతా ఓ కలలా ఉంది.తమ ఇంటిబాల్కనీలో మొదలెట్టి,ఓ ఇరుకు సందులో చిన్నబోటిక్ గా స్థిరపడి,ఇలా అంతర్జాతీయ వేదిక దాకా రావడం,ఎంత ఎగ్జయిటింగ్ గా ఉందో.ఎవరితోనైనా గబగబా మాట్లాడాలని ఉంది.ఏదో ఒకటి. మాటల్లో తన ఉత్సాహాన్నంతా ఒలకబోయాలని ఉంది.సంతోషాన్నంతా పంచుకోవాలని ఉంది.మరో ఏడెనిమిది గంటలు ఈ డివైజ్ ఫ్రీ ఏకాంతం తప్పదు.

పక్కావిడని పలకరించే వీలులేకుండా,ముఖమంతా కప్పేసుకొని మరీ,పుస్తకంలోకి దూరిపోయి ఉంది.అదీ ఏదో అర్థం కాని పేరుతో ఉన్న తెలుగు పుస్తకం.పాత రాతియుగాల పురావస్తునమూనాలా ఉందావిడ. విదేశాల్లో ఉన్న పిల్లలతో గడిపి,తిరిగి వెళుతుందేమో .అసిస్టెన్స్ తో ప్రయాణించే బాపతులా ఉంది.భలే తగులుతారు!పట్టుకొన్న పుస్తకం పేజీలు తిరగేసే చేతివేళ్ళు,చదివేకళ్ళు తప్ప,ఆ మనిషి కుక్కి, కుదేసిన బట్టలమూటలా ఉంది.బొత్తిగా డ్రెస్సింగ్ సెన్స్ లేదు.ఇలాంటి వాళ్ళని, తమ లేబుల్ కి వినియోగదారులుగా ఆకట్టుకోవాలి.అదే సవాలు!

తలతిప్పుకొని తన పనిలో తను నిమగ్నమయింది.దిగీదిగగానే లోకల్ ప్రెస్ లోనూ,ఇతర మీడియాలోనూ రిలీజ్ చేయాల్సిన ప్రెస్ నోట్ లను తయారుచేసుకొంటూ,ఫోటోలను వరసలో పెట్టుకొంటూ ఉండగానే,సర్వింగ్ మొదలయింది.

"వెజ్ ఆర్ నాన్ వెజ్?"ప్రశ్నతో పలకరించింది ఆకాశఅతిథేయి.మూకుమ్మడిగా.

"చికెన్!" ఇద్దరిదీ ఒకే సమాధానం.ఒకేసారి.

పక్కావిడ గొంతువిప్పింది.అంతే.ఇట్టే గుర్తు పట్టేయగలిగింది.ఆ గొంతు విన్న గొంతే.బాగా తెలిసిన గొంతు కూడా.ఎంతైనా ఆ గొంతు వింటూ పెరిగింది కదా.

మరొక ప్రశ్న.మరొక జవాబు.

" ఉడ్ యు లైక్ సంథింగ్ టు డ్రింక్?"

"కాఫీ ప్లీజ్... విత్ ఎక్స్ ట్రా వైట్నర్!"ఇద్దరూ ముక్తకంఠంతో ఒకేసారి అన్నారు.

సందేహం లేదు.సరోజత్త గొంతే.

ఆమె మాస్క్ కిందికి లాగి,హుడ్ ను పైకెత్తుతూ దించుతూ తినడం మొదలెట్టింది.క్వైట్ యాన్ ఎక్సర్ సైజ్!

తను ముఖం పక్కకు తిప్పుకొంది.ఇప్పుడు తన మాస్క్ పక్కకు తీస్తే ఆమెను పలకరించాలి.

సరోజత్త ఎవరో దూరపుచుట్టం కాదు.స్వయాన తన మేనత్త.నాన్నకు తోబుట్టువు.నాన్నఎప్పుడూ 'చిన్నా చిన్నా' అని చెల్లెలిని ఎంతగా కలవరించేవాడో!నాన్నని తలవనైనా తలుస్తుందో లేదో!మహాతల్లి!అయినా,ఈ భూమ్మీద

మరెవరూ లేనట్టు,ఈవిడ పక్కనే వచ్చి పడాలా తను?ఆకాశంలోకి వెళ్ళినా...అంతరిక్షంలోకి వెళ్ళినా...ఎదురుపడక తప్పేట్టు లేదు! ఉఫ్!'అసహనంగా చుట్టూ చూసింది.

విమానం అంతా నిండిపోయి ఉంది.ఇదే బస్సో రైలో అయితే,దిగిపోయేదే.పై నుంచి కదలనీయకుండా,కాళ్ళ మీద సెర్వింగ్ బోర్డ్,దాని మీద ఫుడ్ ట్రే.వెతికితే తనకొక ఖాళీసీట్ దొరకక పోదు.మధ్య సీట్ ముందున్న సెర్వింగ్ బోర్డ్ ని,కిందికి వాల్చి,ఫుడ్ ట్రే ని పెట్టేసింది.పైకి లేచి,నేరుగా క్యాబిన్ క్రూ దగ్గరికి వెళ్ళి,తన సీట్ మార్చమని అడిగింది.

వీలుపడదని వారెంత చెప్పినా,రెస్ట్ రూం పక్కనున్నవారితో ఈ భోజనాల వ్యవహారం అయ్యాక సీట్ ఎక్సేంజ్ చేసుకొనేట్టు ఒప్పించి,తిరిగి వచ్చి తన సీట్లో కూలబడింది.అయితే,పక్కనున్నదెవరో తెలిసాక,ఒక్క ముద్దయినా గొంతు దిగుతుందా?

"తినమ్మా,అపరంజి!ఎప్పుడు తిన్నావో ఏమో!"సరోజత్త ఏ నాన్చుడు లేకుండా తేటగా పలకరించింది.

"అలా పిలవద్దు!"తను దుడుకుగా కసిరింది.సరోజత్త ఏమీ మాట్లాడలేదు.

ఆ మాటలు తన నోటినుండి ఎంత కరుకుగా కాకరగా దూసుకొచ్చాయంటే,మరొకరయితే అక్కడికి అక్కడే బిక్కచచ్చిపోయేవారు. పైనుంచి,తను కళ్ళెర్రజేసి గుడ్లురిమింది.చూపుడువేలును ఆమె ముఖాన ఆడించింది.

సరోజత్త కూడా చలించి,తన తలను మళ్ళీ కిటికీలోకి దూర్చేసింది.

తనే తేరుకొని,ఏ సంబోధనా లేకుండా అంది."ఆప్రా..."

"విన్నాను.ఆప్రా అపారెల్స్ కి అంతర్జాతీయ అవార్డ్ వచ్చిందని.కంగ్రాచ్యులేషన్స్!"సరోజత్త హుషారుగా స్పందించింది.

'ఇంత వేగంగా వార్త చేరిపోయిందా?తనింకా పూర్తిగా అప్ డేట్ చేయనే లేదే!'తనలోతనే గొణుక్కొంది.అది వినబడ్డట్టే సరోజత్త అంది.

"ఎవరో పోస్ట్ చేశారు.తెలుగమ్మాయి దిగ్విజయం అని ఫార్వర్డ్ లు వరదెత్తాయి.తెలుగు గ్రూపుల్లో!"

అప్పుడే శుభవార్త భూప్రదక్షిణం చేసేసిందన్నమాట.సంతోషించాల్సింది పోయి,ఆవిడ నోట వినాల్సివచ్చినందుకు చికాకేసింది. అసహనంగా ముఖం చిట్లించింది. సీట్లో కదిలింది కదిలినట్టుగానే ఉంది.

'అవునూ...తన పేరంటే తనకెందుకంత అసహ్యం? ఆ పేరు పెట్టినవారిని బట్టేనా?'

ఈ ప్రశ్నలు పక్కనున్న సరోజత్త తన మనసులో నుంచి అడిగినట్లు అనిపించింది.తాతయ్య పెట్టిన పేరది.తాతయ్య అన్నమాట పలకడం కూడా తనకిష్టం లేదు.అదేమిటని సరోజత్త అడగదు.వాస్తవానికి తమ ఇద్దరిమధ్యన అలాంటి సంభాషణ జరిగే అవకాశమే రాలేదు.కానీ, సరోజత్తకు తెలుసు.'

కాసేపటి తరువాత సరోజత్త తన ఫోన్ లోని స్క్రీన్ షాట్ ని తన ముందుకి చాచింది.అది ఓ నవతరంగం పేజీలోని తన ఇంటర్వ్యూ క్లిప్. నాయనమ్మతాతయ్యల ఫోటోతో సహా.తన డిజైన్లలో చేనేతను మేళవించిన తీరును వివరిస్తూ,వారెలా తనకు ప్రేరణ అయ్యారో పొగుడుతూ,గొప్పగా చెప్పిన వాక్యాలవి.

తేలికగా తన జుట్టు పైకెగ దోసి, లెక్కలేనట్టు నిర్లక్ష్యంగా భుజాలు ఎగరేసింది,"జస్ట్ బిజ్ ప్రోమో.ప్రమోషన్ కి ఏదో ఒక కథ కావాలి. బలమైన కథ ఉన్న సరుకునే కొనడానికి ఇష్టపడతారు కదా ఎవరైనా! అది నా కథ అయితే,మరింత లాభం!అంతే!"

"నా పేరు మా నాయనమ్మది.సరోజినీ దేవి.జాతీయోద్యమ కాలంలో పుట్టింది కదా.ఆ పేరు పెట్టారు.విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమకాలంలో,స్వచ్ఛందంగా తన వంటిమీద నగలన్నీ వలిచి,ఉద్యమకారులకు ఇచ్చింది.ముక్కెరతో సహా. అప్పుడు సీమ బట్టలన్నీ గుట్టలుపోసి తగలబెట్టిన వారిలో మా తాతయ్య ఉన్నాడని,ఓ రోజు నడివీధిలో దిశమొలతో నిలబెట్టి,కొరడాలతో కొట్టారు."

ఈ కథ మరింత బలమైంది అన్నట్టు చూసింది సరోజత్త.

"అదీ నా పేరు కథ.ఆ కథ లేకపోయినా,నాయనమ్మకొంగులో దోబూచులాడడాలు,ఆమె కుచ్చిళ్ళ మెత్తదనం,ఆమె చేతి అప్పచ్చుల కమ్మదనం,ఆమె వడికే రాట్నం చప్పుడు,అమ్మలక్కలతో వంత పాడిన పదాలు...ఇంకెన్నెన్ని గుర్తొస్తాయో,ఎవరైనా నోరారా ఆ పేరెట్టి పిలిచినపుడల్లా..!"

సరోజత్త కూడా తనకైతనే చెప్పుకొన్నట్లుగా అంది.

"అసలు నాయనమ్మ అంటేనే, పంచ మీద కూర్చుని,ఆమె రాట్నం వడుకుతున్న దృశ్యం కళ్ళకు కడుతుంది.అలా గుర్తొచ్చి కాబోలు,నాన్న చేనేత సహకారసంఘం పెట్టింది నాయనమ్మ పేరు మీదేగా!ఆ సంఘం నూలుబట్టలే కాదు,వాటిపై అద్దే సహజవర్ణాల భద్రత కోసం చాలా కృషి చేస్తుందని తెలుసుగా!"

తెలుసు.అయినా,ఇన్నాళ్ళు ఆ సొసైటీ పెట్టినపేరు ఈవిడగారి పేరనుకొన్నాఇదన్నమాట సంగతి!

"నాయనమ్మ పేరుతో జీవించడం అంత తేలిక కాదు.ఆ పేరొక ఉద్వేగం మాత్రమే కాదు.అదొక బాధ్యత.ఎవరైనా పిలిచినపుడల్లా ,గుర్తుచేసే బాధ్యత. అందుకే కాబోలు అంటారు,పేరు నిలబెట్టుకోవాలని.ఎంతో ఆపేక్షతో ఆ పేరు పెట్టిన వారి నమ్మకాన్ని, ప్రేమను వమ్ము చేయకూడదు కదా!"తన మనసులో మాట తెలిసినట్టే అంది సరోజత్త.

'క్రాప్!' తన పిడికిలి గాల్లోకి కసిగా విసిరింది.'బుల్ షిట్!'ఇక, సహనం హద్దులుదాటింది.

"హి హేటెడ్ మి! ఐ హేట్ హిం!" సరోజత్తను చుర్రున చూస్తూ,తను జమాబందీ తేల్చేసింది.

సరోజత్త ఏమీ మాట్లాడలేదు.ఆమె మౌనం మరింత ఆజ్యం పోసింది.ఆ నిమ్మళానికి ఉక్రోషం పొడుచుకొచ్చింది.

"ఛావొనిస్ట్. మిసో గైనిస్ట్..."ఈ తరహా అరవైఆరున్నర తిట్లు తిట్టి,"హౌ క్రూయెల్!"అని వ్యాఖ్యానిస్తూ శాంతించింది.

తన ముఖం ఎర్రబడి,పొగలుసెగలు కక్కుతోన్న భావన.

సదరు నిందాంకితుడు స్వయాన ఆ శ్రోతకు కన్నతండ్రి!తను పుట్టడానికి మూడుదశాబ్దాల ముందునుంచే,ఆయనను ఎరిగిన మనిషి.

"అంత కాని పని ఆయనేం చేశారు?" సరోజ తేటగాఅడిగింది,"ఎంత చక్కటి పేరు!ఇంతకీ,కోపం ఆ పేరు పెట్టినందుకా?"

ఆ సరోజత్త సూటిప్రశ్నలోని వాడిని తమాయించుకొని,ఆమె వైపు చూడకుండానే అంది,"ఐ హేట్ మై నేం!ఎవరైనా ఆ పేరు పెట్టి పిలిస్తే,ట్రిగర్ అవుతుంది."

"ఆ పేరు పెట్టింది నేను!"సరోజత్త చటుక్కున అంది.

"తెలుసు!"గీరగా అంది తను.'అదో ఘనకార్యమేలే!'గొణుక్కొంటూ.

ఇద్దరూ మౌనంలోకి కూరుకుపోయారు.ఎవరి ఆగ్రహావేశాలను వారు డీల్ చేసుకొంటూ.ఇలాంటి ముఖాముఖి సందర్భం వస్తుందని ఎవరు ఊహించారు?మాస్కులు ఉండబట్టి సరిపోయిందిగానీ, తన ముఖాన తైతక్కలాడుతోన్న భావాలకు వివరణలు అక్కరలేదు.

'ఎవరికి పడితే వాళ్లకి,నన్ను ఇచ్చేద్దామనుకొన్నారా?ఇవ్వాల్సింది!అప్పుడుండేది వీళ్ళ పని!పై నుంచి,ఈ పేరొకటి!అసలు మా నాన్ననాలి!ఇంతచేసినా,వాళ్ళను కలవరించేవాడే,అందుకు!'లోలోనే గొణుక్కుంటూ కూర్చుంది.ఎంత కోపమంటే,మాటలు గొంతులోనే కరడుకట్టాయి.ఏ ఉపద్రవమో ముంచుకు రాకముందే,ఇక్కడనుంచి వెళితే బావుణ్ణు!

తలుచుకోవడం ఆలస్యం,హోస్టెస్ చిరునవ్వుతో ప్రత్యక్షమయింది.

## 2. సరోజ

ఆ యువతి విమానం గుమ్మంలో అడుగుపెట్టినపుడే, అర్థమయింది.ఆ వచ్చేది తన మేనకోడలేనని.ఒకే విమానంలో ప్రయాణం చేయబోతున్నాం కాబోలు అనుకొంది.కానీ, ఇలా ఒకే వరసలో కూర్చుని ప్రయాణించాల్సి వస్తుందని అనుకోలేదు.

తమ తండ్రి స్వయంకృషితో అటు వ్యాపారవేత్తగాను ఇటు వ్యవహర్తగాను మంచిపేరు గడించిన మనిషి.ఆయన స్థాపించి,నిర్వహిస్తున్నసంస్థల్లో బాలికలబడి,మహిళాకళాశాలలు ప్రముఖమైనవి.ఇల్లెప్పుడు అనుకోని అతిథుల రాకపోకలతో సందడిగా ఉండేది.ఎందరికో అది కేరాఫ్ అడ్రెస్సు.

అలా,ఇంటికి వచ్చే పోయేవారికి మా కుటుంబజీవితం తెరిచిన పుస్తకం.పిల్లలం కూడా అందరి మధ్యలో ఎదిగినవాళ్ళం.

తమ ఇంటికోడలుగా భారతి వచ్చినపుడు,ఈ బహుజనహితాయ జీవనవిధానం ఆమెకి మింగుడుపడేది కాదు.'తమ పిల్లలంటే అలాగే పెరిగారు.కోడలికెందుకు ఇబ్బంది'అని,అమ్మానాన్నలు కొత్తజంటకు నచ్చినట్లు,స్వతంత్రంగా ఉండే ఏర్పాట్లు చేసారు.అదే భవనంలో చెరో అంతస్తులో ఉండసాగారు.

ఈ ఏర్పాటు అందరికీ అనువుగానే ఉంది.అన్నయ్యకు,అతని భార్యాబిడ్డలకు స్వతంత్రంగా ఉన్నది.భారతి తరపు బంధువుల రాకపోకలకు సౌకర్యంగా ఉన్నది.

'మేమిద్దరం మాకిద్దరు 'అని అనుకొనే రోజులవి కనుక,ఇద్దరు పిల్లలు పుట్టాక,ఇక చాలు అని అనుకొంటారనుకొన్నారు.

“సరిగ్గా ఇరవై ఎనిమిదేళ్ల నాలుగు నెలల పదకొండు రోజులు”,సరోజ హఠాత్తుగా గొణిగింది.

'అది తన వయసు!'పక్కనే బిగుసుపోయి కూర్చున్న అపరంజి చెవులు రిక్కించడం తెలుస్తోంది.

'వాస్తవానికి,ఇదంతా అంతకు మూడునెలల ముందే మొదలయ్యింది.'సరోజ తనలోతనే అనుకొంది.

ఈ కాలాన ఇద్దరు బిడ్డల సంరక్షణ,బాగోగులు చూడడమే గగనం.మూడోబిడ్డను ఊహించనే లేదు.అదుగో అప్పుడే,'ఇంతటి సంపన్నులు. ఒక వారసుడన్నా ఉండాలి'అన్నమాట భారతి పుట్టింటివారి మాటగా ప్రచారంలోకి వచ్చింది.ఆ పెద్దాయన ఆస్తంతా ఎక్కడ ఆడపిల్లల కొడుకులకి కట్టబెడతాడో...ఎక్కడ దానధర్మాలు చేస్తాడో...అని వ్యక్తపరచడానికి వారేమీ సందేహించలేదు. వారి భయాలు వారివి.ఆ భయాలు వారివి మాత్రమేనా?అదీ తెలియలేదు.'సరోజ తల విదిలించింది.

"ఉదయలక్ష్మిగారు బావున్నారా?"సరోజ ఉన్నట్టుండి అడిగింది.ఆమె అపరంజి పెత్తల్లి.

"హ్యాపీగా ఉన్నారు.శివాని పెళ్ళి.వెడ్డింగ్ కాస్ట్యూంస్ డిజైన్ చేస్తున్నా!"సమాధానం చటుక్కున వచ్చింది.శివాని ఉదయలక్ష్మి దంపతుల దత్తపుత్రిక .

"శుభం!" సరోజ తలాడించి,విమానం రెక్కలమీద దోబూచులాడుతోన్న మేఘాలను కొలవడం మొదలెట్టింది. అక్కడ ఏమేం జ్ఞాపకాలు కనబడుతున్నాయో.

సరిగ్గా ఇలాంటి మబ్బులు పట్టిన ఉదయాన్నేకదా,ఉదయలక్ష్మి తమింటికి వచ్చింది.నాన్నపత్రికలు తిరగేస్తున్నారు.అమ్మేమో దోసెడు మొలకెత్తిన పెసలు,చంచాడు నానేసిన మెంతులు, తినమనీ,ఆ పై,తేనె వేసిన నిమ్మరసం తాగమని నాన్నను పోరు పెడుతోంది. ఎక్కడ మర్చిపోతారో అని,ఆ బృహత్కార్యాన్ని అమలుచేసే పనిని, తనకు పురమాయించి వెళ్ళింది. నాన్నతో కబుర్లు ఎలా కలపనా అనుకుంటూంటే,తను రాస్తోన్న రచన గుర్తొచ్చింది.ఆ కథ

చెప్పడం మొదలెట్టింది. స్వతంత్ర ఆలోచనలతో స్వావలంబన సాధించిన యువతి కథ అది.అంతా విన్నాక, నాన్న ప్రసన్నంగా అడిగారు," ఇంతకీ ఏవేం బాధలు పెట్టావ్?"

"బాధితురాలయి ఉండాలా? విజేత కావడానికి! "

"సాధారణం గా పుట్టెడు బాధల్లో ఉన్నట్టుగా, వాటితో పోరాడుతూ నిగ్గు తేలినట్టుగా రాస్తారుగా మీ కథల్లో"

"నిజమే, ఎందుకంటే, అది జీవితం. పుటం పెడితేనే గా బంగారం స్వచ్ఛపడేది! అయితే, మెరిసేపోయే క్షణాన ఆ బంగారుకణిక పుటాన్ని,బొగ్గులకుంపటిని, ఆ పై, సమ్మెట దెబ్బలని తలుచుకొంటుందా ఎప్పుడైనా? బాధితురాలిని అని  కుమిలిపోతుందా?

"లేదు. కానీ...జరుగుతున్నది అదే కదా.."

"నిజమే నాన్న, లేకుండా ఉంటే బావుణ్ణు. కానీ, బాధలు సర్వకాల సర్వావస్థల్లోనూ ఉన్నాయి. ఉంటాయి. ఉన్నబాధలను దాటివచ్చిన వారే కదా,వ్యక్తులుగా నిలదొక్కుంటారు? ఆ బాధ దాటవలసిన గడప లాంటింది. ఎవరైనా గడపని భుజాన కాడిని మోసినట్లు మోసుకు తిరుగుతారా ఏంటి ?"

తను అన్న తీరుకి నవ్వొచ్చిందో,ఆ దృశ్యం కళ్ళకు కట్టిందో కానీ,వచ్చీరాని నవ్వుతో నాన్న ముఖం మరింత ప్రసన్నమయింది.

“జీవితం పుటం పెడుతుంది, వారెప్పుడూ బంగారుతల్లులే!"తను ముక్తాయించింది.తేటగా.

నాన్న ఏకీభవిస్తున్నట్టు తలాడించారు.నాన్నకుతూహలంగా అడిగారు.

" ఇంతకీ,ఆ కథానాయిక పేరేమిటో?"

" నా కథల్లో పాత్రల పేరు ముందుగా ఎప్పుడైనా చెబుతానా?"

"సరే, చెప్పమాక.నీ దగ్గరే అట్టి పెట్టుకో!"నాన్న చిన్నపిల్లాడిలా  కినుకపడ్డారు.

"సరిపోయారు తండ్రీకూతుళ్ళిద్దరూ..!వచ్చి కాఫీ పట్టుకెళ్ళు!"వంటింట్లోనుంచి అమ్మ ఓ కేకేసింది.అదే మరి అమ్మంటే.ఓ చెవి ఎప్పుడూ ఇటు వేసి ఉంటుంది కదా.ఏ మాత్రం గాడి తప్పినా, లోకంలోకి లాక్కొస్తుంది.

అప్పుడు చూసింది.ఉదయలక్ష్మిని. తలుపు తీసిన చప్పుడు కూడా కాకుండా వచ్చి,సోఫా అంచును ఆనుకొని నుంచుందావిడ.

నిజం చెప్పొద్దూ,ఆ వేళప్పుడు అనుకోనిఅతిథిని అలా అదాటున చూసి,అదిరిపడిన మాట నిజం.తను తేరుకొనేలోపలే, నాన్న అతిథిని పలకరించి,కూర్చోమన్నారు.పరస్పర క్షేమసమాచారాలు,మంచినీళ్ళ మర్యాదలు అయ్యాక,ఆమె అడిగింది.ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండా.

"భారతి కి మూడో ఆడపిల్లంట.మాకిస్తే, మేం పెంచుకొంటాం మావయ్యా...ఊరికే కాదు.దత్తత తీసుకుంటాం!,"అప్పుడే అక్కడికి కాఫీతో వచ్చిన అమ్మముందుగా తేరుకొంది.ఎలా స్పందించాలో తెలియనట్టు,నిర్ఘాంతపోయిన నాన్నమౌనంగా తలవాల్చి,నానేసిన మెంతుల వంక తీక్షణంగా చూస్తున్నారు.

"మావయ్యా..అత్తయ్యా..మీ స్థాయికి తగ్గట్టే పెంచుతాము.ఘనంగా పెళ్ళి చేస్తాము..."

అమ్మే మొదట మాట్లాడింది."మా బిడ్డ మాకు భారమేంటమ్మాయ్?అయినా, భారతి ఎప్పుడు స్కాన్ కి వెళ్ళింది?ఏ బిడ్డని ఎవరు చెప్పారు?మా అబ్బాయి మాతో ఒక మాటైయినా అనలేదే!అప్పుడే మీ దాకా వార్త వచ్చిందీ!"

ఉదయలక్ష్మి తత్తరపోయింది.

"అమ్మా,అసలు మీకు ఆ ఆలోచన ఎలా వచ్చిందో తెలియదు.పుట్టబోయేది ఏ బిడ్డయినా,మా మనవసంతానమే.భద్రంగా జీవించే హక్కు,హాయిగా ఎదిగే స్వేచ్ఛ వారికుంటాయి కదా.మామటుకు మేము వారి చదువుసంధ్యలకు,భవిష్యత్తు ఆర్థికభద్రతను ఏర్పాటుచేసే వెళతాము.అంతకు మించి ఏమి చెప్పగలను?"

ఆవిడ గుడ్లనీరు కుక్కుకొని, గబగబ వెళ్ళిపోయింది.నేరుగా భారతి వాళ్ళ దగ్గరికి.

అలా నిరాశగా వెళ్ళిన మనిషి,ఎవరెవరికి ఏమిచెప్పిందో,ఆ విన్నవారు ఏమి గ్రహించారో వారికే ఎరుక.

"భలే ధైర్యం చేసి అడిగావ్ లే,పద పదవమ్మా.."అని వాకిలిగుమ్మం చూపించకుండా,ఆ నిస్సంతు దయనీయ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని,ఒక బిడ్డను పెంచాలనుకుంటున్న ఆలోచనను గ్రహించి,చేతనయినంత సున్నితంగా మర్యాదగానే చెప్పిపంపారు.

'అయినా,ఇదంతా కేవలం ఒక నిస్సంతు తపనా?మరెవరో ప్రేరణా?లేక తమ స్పందన తెలుసుకోవడానికి పెడుతోన్న పరీక్షా?

ఏదైతేనేం?మూడోబిడ్డ ఆడపిల్ల అయితే,ఇదా పరిష్కారం?తమ కోడలు ఈ ఆలోచనను ఎలా సాగనిచ్చింది?తమ కొడుకు ఎలా మాట్లాడనిచ్చాడు?వాళ్ళిద్దరూ తమను ఏమి అవగాహన చేసుకొన్నట్టు?"

ఆ మాటే అమ్మ అడిగితే,ఆవిడ అంది కదా,"మీరు ఒప్పుకొంటే,మీ మాట వాళ్ళు కాదనరు కదా అని అనుకొన్నా?"

"ఏ అమ్మానాన్నలకైనా బిడ్డను ధారాదత్తం చేయమని ఎలా చెబుతాం అనుకొన్నావమ్మా..?మా ఆలోచన ఏమిటో,మా కొడుకూకోడలికి ఏ మాత్రం గ్రహింపు ఉన్నా,మీకు ఇంతటి ఆశ కల్పించేవారు కారు.మిమ్మల్ని మాదాకా రానిచ్చే వారూ కారు.మిమ్మల్ని బాధ పెట్టినాళ్ళమవుతున్నాం.క్షమించండమ్మా.అయితే,మిమ్మల్ని ప్రేరేపించిన వారికి చెప్పండమ్మా.మా బిడ్డ మాకు భారం కాదు." ఈ సారి నాన్న స్పష్టంగా అన్నారు.

అదుగో అప్పుడే,ఆవిడ గుడ్ల నీరు కుక్కుకొని,గబగబా వెళ్ళిపోయింది.

"అసలు అలాంటి ఆలోచన ఎలా వచ్చింది? అంత ధైర్యంగా ఎలా అడగగలిగింది?"నాన్నఅమ్మతో పదేపదే అంటూనే ఉన్నారు. తలుచుకొని తలుచుకొని బాధ పడుతున్నారు.'ఇలా కూడా ఆలోచిస్తారా?'అన్న అమ్మ ప్రశ్న ఇప్పటికీ చెవుల్లో రింగుమంటోంది.

తమ కోడలు,ఆమె పుట్టింటి వారు తమ గురించి ఎలాంటి అపార్థాలు కలిగిఉన్నారో అని బాధ పడాలా?ఈ ఆలోచనలల్లో తమ కొడుకు పాత్ర ఏమిటి అని దిగులు పడాలా?అసలు వారసుడు అన్న ఆలోచనే పొరపాటు కాదూ?దాని కోసమై మూడో బిడ్డ కావాలనుకోవడం..మరెంత పొరపాటు?ఉదారవాదులం అనుకొన్న కుటుంబం ఇది!ఇలాంటి చోట,ఎలాంటి ఆలోచనలు?

"అది మూడోఆడపిల్ల అనగానే పదుగురాడు మాట! పాడియై చెల్లుతుంది!"తను తేల్చి చెప్పింది.

"అయితే మాత్రం? కాస్త ఇంగితం ఉండొద్దూ?ఎవరు ఎలాంటివాళ్ళో,ఇన్నేళ్ళయినా గ్రహించలేదూ?"అమ్మ గట్టిగా దులిపేసింది.

"వివరణలు ఎందుకు?మీ మూడో సంతానాన్ని.నేను లేనూ?వాతావరణాన్నికాస్త తేలిక పరుద్దామని అంది తను.

అందరి నడుమ మౌనం ఘనీభవించింది.

కాసేపయ్యాక, మాటమార్చడానికి కాబోలు నాన్నే అడిగారు."ఇందాక చెబుతున్నావే నీ కొత్త రచనలోని పాత్ర గురించి..."

అప్పటి దాకా, నిర్భాంత ప్రేక్షరాలిగా ఉన్న తను వెంటనే స్పందించింది. " నాన్నా,ఆమె రచన లోని ప్రధానపాత్ర.ఆధునికురాలు.తన అస్తిత్వ చేతనతో, తన వ్యక్తిత్వంతో, స్వావలంబనతో...పూర్ణమత్వం పొందుతుంది.ఆమె స్వంత ఆలోచనలతో,స్వతంత్ర భావాలతో ఒక ప్రత్యేకతను సాధిస్తుంది."

"సరిగ్గా అదే ఆ బిడ్డలో నేను కోరుకొంటున్నది.ఏనాటికైనా నువ్వు రాసిన ఆ పాత్రని గురించి ఆ పాప చదువుతుందంటావా? ఆ ప్రజ్ఞామూర్తిని గురించి తెలుసుకొంటుందా?ఆంతర్యాన్నిగ్రహిస్తుందంటావా?అయినా,మన వెఱ్ఱి కాకపోతే, అమ్మాయ్...అసలు ఆమెకు తెలుగు వస్తుందంటావా?"

"తెలుగు రాకపోవచ్చు నాన్నా,తెలివిరాకుండా పోదు కదా.ఏనాటికైనా!"అలా ముగిసింది ఆనాటి తమ సంభాషణ.

అందుకే,'నీ మేనకోడలికి పేరేం పెడతావని'అన్నయ్య తనను అడిగీఅడగ గానే,తను నవ్వుతూ అంది,"నాన్న చెపుతారులే అన్నాయ్,అందాక ఆగుమరి!".

ఆ పసికందు నామకరణం రోజున,నాన్న బుజ్జి పాపాయికి ఆ పాత్ర పేరు పెట్టేసారు.అలా పాప కన్నా ముందే ఆమె పేరు పుట్టిందన్న మాట! అపరంజికి తన పేరు వెనక జరిగిన సంగతి తెలుసో లేదో. నాన్న ఊహించినట్లుగానే, ఫ్రెంచ్,స్పానిష్ తదితరాల మధ్య తెలుగు మాత్రమే నేర్పని,ఇంగ్లీషుబడుల్లో చదివింది కదా మరి.

తన 'అపరంజి' మాత్రం దేశదేశాలు తిరిగేసి వచ్చింది.మా అమ్మాయికో,తమ సంస్థకో ఆ పేరు పెట్టుకొన్నాం అని పాఠకుల తమ అభిమానంతో అడపాదడపా ఆశ్చర్యపరుస్తుంటారు.ఇప్పుడు కూడా అలాంటి అంతర్జాతీయ సాహిత్యసమావేశాలకే వెళ్ళి వస్తోంది.

సరోజ మెల్లిగా వంగి, ఒకవారగా పెట్టిన పుస్తకాల సంచిలోంచి, "అపరంజి"ని పైకి తీసింది.అట్టమీది శీర్షికను ఆర్ద్రంగా తడిమింది. ముఖచిత్రంలోని అపరంజిని మునివేళ్ళతో తడుతూ...మేనకోడలి వైపు చూడకుండానే,ఆనాటి సంభాషణనంతా బిగ్గరగా చెప్పింది. ఆమె వినిందో పెడచెవిన పెట్టిందో అని పట్టించుకోకుండా.

చివరిగా,ఆమె వైపు చూసి'అపరంజి' పుస్తకాన్ని ఆమె వైపు చాచింది,"వీలున్నప్పుడు చూడు!"

అపరంజి తలఎత్తి గానీ,తిప్పిగానీ చూడలేదు.

ఇంతలోహోస్టెస్ వచ్చి,రెస్ట్ రూం పక్కన వ్యక్తి సీట్ మార్చుకోవడానికి సిద్ధమని చెప్పివెళ్ళింది.

అపరంజి సరోజతో ఒకమాట కూడా మాట్లాడకుండా,పక్కసీట్లో ఎడాపెడా పడేసిన తన సామాను సర్దుకొంటోంది.

సరోజ ఈ మారు బిగ్గరగా స్పష్టంగా అంది."ఒక్క మాట. పేరు మార్చుకోవడం పెద్ద పనేం కాదు.లాయర్ని అడిగితే చెబుతారు. నచ్చనిది ఏదైనా వదిలేయాల్సిందే.నిత్యం అసహ్యించుకొంటూ ద్వేషిస్తూ ఉండాల్సిన పని లేదు.నచ్చని దానిని ఎన్నాళ్ళు పట్టుకు వేళ్ళాడతాం?సంతోషంగా ఇష్టంగా బతకాలి. అనుక్షణం.ముఖ్యంగా,మనతో ముడిపడిన మన పేరుతో. పేరు మార్చుకోవడం కొత్తది పెట్టుకోవడం ఎంతసేపు?ఎవరికీ ఎవరి సలహా అక్కర్లేదనుకో.అనుమతి అవసరం లేదు."అపరంజి వింటుందా లేదా అని పట్టించుకోకుండా,సరోజ చెప్పుకుపోతోంది.

"మా అన్నయ్య అల్పసంతోషి.నేను పేరు చెప్పాలి.అమ్మానాన్నలు నామకరణం చేయాలి.అల్పసంతోషే కాదు,అల్పాయుష్షుడు కదా.ఇక అల్పమో స్వల్పమో,అన్నయ్య సంతోషాలతో ఇక పనేం ఉంది?"

అపరంజి మౌనంగా లేచివెళ్ళింది.తన సామానుతో సహా.

★

' సారీ అప్రా, ఎంతగా దగ్గర కు తీసినా, దూరంగా పరిగెత్తే దానివి. పిల్లలంతేలే అనుకొన్నాం గానీ, లోలోపల ఇంత కోపం పెట్టుకొన్నావని తెలియలేదు. కాదు. ఆ మాట అనలేను. తెలుస్తూనే ఉంది.

పొద్దున లేచేటప్పటికి వాకిలి పక్కన గోడలనిండా బొగ్గుతో,రాక్షసుడి బొమ్మో బూచాడిబొమ్మో గీసి,'ఐ హేట్ తాతయ్య' అని రాసినప్పుడే తెలుసు.ఫ్యామిలీ ఫోటోలో నా బొమ్మ మాత్రమే తొలగించి ,నీ ఎఫ్.బీ.వాల్ మీద

పెట్టినపుడే తెలుసు.నీ ఆన్లైన్ గేం లో విలన్ కి నా పేరుపెట్టి, నన్నుట్యాగ్ చేసినపుడే తెలుసు.అన్నట్లు, నువ్వు ఎడిట్ చేసిన ఫ్యామిలీ ఫొటోలో నా వళ్ళో బుట్టబొమ్మలా కూర్చుని ఉన్నది నువ్వే కదా.నాతో పాటు నిన్నూ కత్తిరించేశావ్!

నిజమేమిటో నిదానంగా తెలుసుకొంటావు లే అని అనుకొన్నా.

ఎందుకంత ద్వేషమో,ఇప్పుడే గ్రహించాను.నీ పేరు పెట్టడమే నా తప్పని తెలిసింది.తప్పే.ఎప్పుడో వివరణ ఇవ్వాల్సింది.నిన్నీ ద్వేషగుండం నుంచి బయట పడేయాల్సింది. ఆ అవకాశం ఎక్కడుందసలు? కంచుకోటలా కథలల్లి, చుట్టూ అపార్థాల కందకాలు తవ్వి కూర్చున్నప్పుడు, ఏమి చేయగలం? ప్రతి మాటకు పెడర్థాలు తీస్తోంటే,ఎలా వివరించగలం?

"అసలా ఆలోచనేమిటి?," అంటూ అగ్గి మీద గుగ్గిలమైన నాన్న గుర్తొస్తున్నారు."చెట్టుకి కాయ భారమా? "అని నిలదీస్తోన్న అమ్మ గుర్తొస్తోంది. కఠినంగా ఉంటుంది కానీ, పుటం పెట్టనిదే బంగారపు నాణ్యత తేలుతుందా? కల్మషం వదులుతుందా? నిఖార్సుగా మిగులుతుందా? జీవితం పుటం పెడుతుంది. వద్దన్నా.కాదన్నా.అది అంతే.

మళ్ళీ కలుస్తామో లేదో తెలియదు.నీ తోవ నీది. నాతోవ నాది. మనుషులం అన్నాక అపార్థాలు సహజం.

ఆలోచనల ముందరికాళ్ళకు బంధం వేసేది, కొన్ని స్థిరపడిపోయిన మూస భావనలే."మూడోసారి ఆడపిల్ల అనగానే, ఇంటికి వారసుడు లేడంటూ అత్తింటివాళ్ళు ఆరళ్ళు పెట్టారు"అని వింటుంటాం. అందుకు భిన్నంగా ఆలోచించేవారు ఉంటారు అని అనుకొలేనంతగా,మనం ఆ వాక్యాన్ని అంగీకరించాం.బహుశా భారతి కూడా అలాంటి వాక్యప్రభావంలో పడిఉంటుంది.సహజంగానే.

కథలోని ఒక పాత్రకు పేరుపెట్టడానికే సవాలక్ష సార్లు ఆలోచిస్తానే, అన్నయ్య స్వయంగా,'చిన్నా, నీ మేనకోడలికి పేరు పెట్టమ్మా!' అని అడిగినప్పుడు ఎంత ఆలోచించి ఉంటాను?'

సరోజ కళ్ళుచెమ్మగిల్లాయి.చెప్పదలుచుకొన్నమాటలు తనతోనే మిగిలిపోయాయి.

'సారీ, హి నెవర్ హేటెడ్ యూ!బట్ యూ హేటెడ్ హిం!నువ్వు ద్వేషించింది మా నాన్ననేనా?అన్నయ్యనూ కాదూ?

ఇరవైఎనిమిదేళ్ళకు పైగా ద్వేషగుండంలో పడిఉన్నావు.దానిలో నుంచి బయటపడే ప్రయత్నమైనా చేయగలిగావా?

ఇప్పుడెందుకు గతించిన కబుర్లుచెప్పడం?బాధితురాలివన్న భావన నుంచి ఇకనైనా స్వేచ్ఛ పొందుతావని.విజేత కావడానికి బాధితురాలివై ఉండక్కరలేదని గ్రహిస్తావని.విక్టిం స్టోరీ విక్రయసరుకు కాదని తెలుసుకొంటావని.ఆ పై నీ ఇష్టం.'

సరోజ టైప్ చేస్తున్న మెసేజ్ ను ఆపింది.అర్ధాంతరంగా అపరంజికి పంపేసింది.అది ఎప్పటికో చేరుతుంది.

సరోజ మేఘాల్లోకి చూపు మళ్ళించింది.

'పసిగుండెలో నాటుకొన్న అబద్దం. ఎంత కోపం ఎంత కసి. అది తలుచుకొంటేనే , బాధగా ఉంది. తెల్లారితే ఎవరి కంటైనా పడుతుందేమో అని, ఆ శీతాకాలం మునిచీకట్లలో , వాకిలి పక్కని గోడ మీది బొగ్గురాతలని , నీళ్ళు చల్లుతూ, కొండ చీపురుతో బరబరా కడుగుతోన్న అమ్మ కళ్ళల్లో మెదులుతోంది.

కానీ, మనసులోకి నాటుకు పోయిన మాటలను ఎవరు తుడిచేయ గలరు?

నిజమే, అమ్మ అలా చేయాల్సింది కాదేమో. ఆవిడకప్పుడు తోచింది అదీ. పిల్లచేష్టలని విడిచిపెట్టకుండా ,పిలిచి మాట్లాడాల్సిందేమో. అనవసరపు రాద్ధాంతాలవుతాయని ఎవరితో చెప్పకుండా దాచిపెట్టి ఉండాల్సింది కాదేమో.మొగ్గలోనే తుంచివేయాల్సిన అపార్థం,ఆమెతో పాటు పెంచి పోషించుకొంది కదా.

కాలానిదేం ఉంది.కదలిపోతుంది.దానిపాటికి అది.చడీచప్పుడు లేకుండా.

ఆపేక్షలు అభిమానాలు ఏర్పడకముందే.మనసుల్లో ఖాళీలు పూరించుకోక ముందే.

ఏమనుకొన్నా,తాతయ్య చెంతన కూర్చుని కబుర్లు చెప్పుగలమా?ఉప్పుమూటలెక్కగలమా?నాయనమ్మ కొంగు లాగుతూ చిరుతిళ్ళుపెట్టమని మారాం చేయగలమా?మురిపాలు గారాబాలు రమ్మంటే వచ్చేవా?అయినా, వారసత్వం అంటే కేవలం స్థిరచరాస్తుల రూపంలో అందేదేనా?ఇవ్వాళ్టి అపరంజి విజయంలో మా నాయనమ్మ రాట్నంచప్పుడు వినబడడం లేదూ? అపర ముత్తవ్వ!అని మురిసిపోయేవారు కాబోలు నాన్నే ఉంటే.అయినా ఆ మురిపాలన్నీ,ఈ సెల్ఫీతరం వారికి ఏం నచ్చుతాయిలే!

నిజం నిలకడ మీద తెలవచ్చుకాక.కాలంలో కలిసిపోయిన వారు,తిరిగొస్తారా?

అపార్థాల చిక్కుముళ్ళు విప్పుకోడానికి కాకుంటే,ఈ చదువులెందుకు?

అయినా,ఆయన ఇంటిపేరు ప్రియం.ఆయనిచ్చి వెళ్ళిన ఇళ్ళూవాకిళ్ళతో పేచీలేదు.ఆయన మాత్రం అక్కరలేదు.అదీ లోకం తీరు.'

సరోజ పెదాల మీద ఒక పేలవపు నవ్వు కదలాడింది.మానవ సంబంధాల్లోని బోలుతనపు స్పృహ ఛెళ్ళుమనిపించినట్లయింది. అన్నీ ఆర్థికబంధాలేనా?ఆనాటి ఆపేక్షలేమయ్యాయి?ఆప్యాయతలెటుపోయాయి?

నామకరణం పొద్దున నాన్న కుతూహలంగా అడగడం ఇప్పుడే అడిగినట్లుగా ఉంది.

'ఇంతకీ,నీ పాత్ర పేరేమిటన్నావ్ అమ్మాయ్?"

"అపరంజి! అచ్చమైన స్వచ్ఛమైన బంగారం. నూటికి నూరుపాళ్ళు నిఖార్సైన బంగారం."

'నిజమే, జీవితం పుటం పెడుతుంది.అందులో మెరుగుతేలిన ప్రతి బిడ్డా,బంగారు తల్లే!బంగారుతండ్రే!'సరోజ నిట్టూర్చింది.

'ఇంతకీ,తనొకటేనా విక్టిం స్టోరీ లోంచి బయటపడాల్సింది.ఇంకెవరెవరం?'

అంతలోనే లాండింగ్ అనౌన్స్ మెంట్ వచ్చింది.విమానం నేలమీదకు దిగీదిగక ముందే,సెల్ ఫోన్ స్విచ్ ఆన్ చేసీ చేయకముందే, అలెర్ట్ వచ్చింది.అది అపరంజి నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్.తన పూర్తి పేరుతో సహా.

బ్యాగేజ్ క్లెయిం దగ్గరికి వెళ్ళేసరికి మరో స్వరసందేశం.

"అర్థం అయింది.నాకు తెలియకుండానే,ఇన్నాళ్ళు  ద్వేషించింది మీ నాన్ననే కాదు,మా నాన్ననని."అపరంజి తనలో తనే గొణుక్కున్నట్టు అంది.వినిపించీ వినిపించకుండా.'సారీ... సరోజత్తా!"

అసలు కథ ఇప్పుడే మొదలయింది.

★★★

COMMENTS